

# తాతయ్య చేతికర్ర

రావూరు వెంకట సత్యనారాయణరావు

మాధవయ్య వున్న మాగాణి అంతా అమ్మి కొడుకు సుబ్బారావును లాయరు చేశాడు. చదువులో వుండగానే పెళ్ళి అవడం వల్ల సుబ్బారావు కొడుకు పుట్టిన సంవత్సరమే బస్తీలో బల్ల కట్టాడు. మాధవయ్య ఆ బల్లవంక చూచి ఆనందాశ్రువులు రాల్చాడు. అరుగుమీద కూర్చుని కొడుకుని ఆశీర్వదిస్తూ వుండేవాడు. వీధిలో ఎవరు మంచిదుస్తులు వేసుకు వస్తున్నా కొడుకు కోసం వస్తున్న పెద్దతరహా పార్టీలను కొనేవాడు.

అరుమాసాల దాకా సుబ్బారావు ప్రాక్టీసులో యింటిఅద్దెకు రావడమే కష్టమైంది. గుమాస్తా జీతం చేతిదేయిచ్చుకోవలసి వచ్చేది. మాధవయ్యభార్య సుందరమ్మకు పుట్టింటివారు పసుపు కుంకుమ్మక్రింద యిచ్చిన ఆస్తి అయిదెకరాలుంది. దాంట్లో వచ్చే పంట ఒక్కటే ఆధారమైంది. అయినా కడుపు పండింది గదా అని గంపెడాశతో సంబరాలు పడుతూ వుండేవాడు మాధవయ్య.

కొడుకు క్రొత్త లాయరవడం వల్ల పార్టీలు ఎక్కడంలేదు 'చేపకు క్రొత్తనీరు కావాలి—పార్టీలకు పాతప్లీడర్లు కావాలి' అనుకొన్నాడు మాధవయ్య. కొంచెం పాత పడితే కొడుకు సంపాదనకేం ఫర్వాలేదనుకొన్నాడు. తెల్లవారుజామున లేచి రోజూ కొడుకు కట్టిన లాయరుబోర్డు ఉత్తరీయంతో తుడిచేవాడు. సూర్యకిరణాలు పడగానే బల్ల మిలమిల లాడేది. ఇంత కొత్తగా కనిపిస్తే పార్టీలు రారేమో ననుకొనేవాడు. కొన్నాళ్ళు తుడవకుండా వుందామనుకొనేవాడు. కాని ఏరోజుకారోజే మరిచిపోయి దాన్ని తుడిచేవాడు. 'పదిహేను ఎకరాల మాగాణితో సంపాదించిన బల్ల అది. కొంచెం పాత పడితే నూటయాభై ఎకరాల మాగాణి వస్తుందా బల్లనుంచి. ఇది మాపాలిటి కామధేనువు' అని పొంగిపోయేవాడు.

ఎలాగైనా కొంచెం సంపాదనలో పడాలని సుబ్బారావు ఎంతో ప్రయత్నించాడు. కేసులు బాగా చదివేవాడు నిలుస్తుంతవరకు వాదించేవాడు. కాని ఫలితం దక్కడం తక్కువగా వుండేది. అందువల్ల లోలోపల ఎంతో చింతపడుతూ వుండేవాడు.

రెండు సంవత్సరాలు గడిచినాయి. రాబడిలో మార్పులేదు. అందరూ సుబ్బారావులో నేర్పు తక్కువ అన్నారు. అతని పక్షాన కోర్టుతీర్పు రావడం కష్టమనుకొన్నారు. సుబ్బారావుకి మార్గం తోచలేదు. మాధవయ్యకు మనస్సు సరిగాలేదు. ఇద్దరూ ఇంచుమించుగా మౌనంగానే వుండిపోయేవారు.

ఒకనాడు అత్తవారి ఊరిలో మంచి కేసున్నదని మామగారు కబురు పంపారు. సుబ్బారావుకు అనుమానంగానే వుంది మనస్సులో. అయినా వెళ్ళాడు. కేసు బాగా చదివాడు. గెలుస్తాననే ధైర్యం వచ్చింది. ప్రతివాయిదాకు పార్టీలు ఆ ఊరునుంచి కారు పంపేవారు. ఒక్కొక్కప్పుడు భార్య పద్మను కుమారుడు చిరంజీవినీకూడా తీసుకొని వెడుతూ వుండేవాడు.

కేసు తీర్పు రోజు వచ్చింది. రాత్రికే తిరిగి వస్తానని సుబ్బారావు వెళ్ళాడు. కేసు నెగ్గింది. అతని ఆనందానికి అంతు లేదు. పార్టీలు అయిదువందలు ఫీజు తెచ్చి

ఇచ్చారు. మాసుగారికి అభినందనలు అందించి బయలుదేరాడు. దిగ్విజయవార్త యింటివగ్గిర చెప్పాలనే తొందర ఎక్కువైంది మనస్సులో. రాత్రికి తన ఊరుతిరిగి వెళ్లాలనే భావంతో డ్రైవర్‌కారు అతి వేగంగా తోలుతున్నాడు. ఆ విసురు సుబ్బారావు మనస్సుకెంతో హాయి అనిపించింది. జేబులో డబ్బు పలకరించి నవ్విస్తోంది. ఊరు పదిమైళ్ల దూరంలో వుండగా కారు ప్రమాదానికి గురి అయింది. సుబ్బారావు జీవితం హటాత్తుగా పరిసమాప్తమైంది. జేబులోవున్న సొమ్ము అంత్యక్రియలకు వెతుక్కోకుండా సరిపోయింది. ఇంట్లో జీవితాలవలెనే వాకిట్లో బల్లకూడా విషాదఛాయలు పులుముకొంది.

మాధవయ్య మళ్ళీ స్వగ్రామానికి చేరాడు. బాంధవులవని ఇంట్లోనే, రోజా గడవని ఆ కుటుంబం తల దాచుకొంది. మాధవయ్య కొడుకుపేరుతోవున్న బల్ల మాత్రం జాగ్రత్తగా తెచ్చుకొన్నాడు. పూజా మందిరానికి ప్రక్కగా పెట్టుకొన్నాడు. మనుమడు చిరంజీవిని చూస్తే అతనికి దుఃఖం ముంచుకువచ్చేది. కాని అతని భవిష్యత్ తలచడంతోనే కంటి జలమంతా ఆలోతు గుంటల్లో ఇంకిపోయేది.

రాత్రిళ్లు అపచారం చేసినవాడిలాగా ఆక్రోశించేవాడా వృద్ధుడు. చిరంజీవి ప్రక్కమీదనుంచి కొంచెం కదిలితే కిక్కురు మనకుండా వూరుకొనేవాడు. ఎవరిగతి ఎలా వున్నా సూర్యుడు తన క్రమం ప్రకారం ఉదయించక తప్పదుగదా! మాధవయ్యా ఎర్రటి బింబంవంక చూసేవాడు, కోడలి నుదుటి కుంకం జ్ఞాపకం వచ్చేది. ఆ కుక్కి మంచంమీద మళ్లీ కూలిపోయేవాడు. చిరంజీవి 'తాతా! తాతా!' అని చెయ్యి పుచ్చుకొని లేపినప్పుడు లేచేవాడు. అతనితో కబుర్లుచెప్పేవాడు.

ఇద్దరూ పాలు త్రాగేవారు. తాత కొంచెంసేపు పాఠం చెప్పేవాడు. సుందరమ్మ కోడల్ని వదలకుండా తిరుగుతూ వుండేది. తన కళ్లల్లో ఊటలు తుడిచివేసుకొని కోడలి కళ్ళు కొంగుతో తుడుస్తూ కూర్చునేది. పద్మ గాపురమన్నప్పుడు ఆమె పిచ్చిదైపోయేది. కన్నకడుపు సన్నసన్నగా కత్తిరించినట్లయ్యేది. అప్పుడప్పుడు పద్మను పుట్టింటివారు వచ్చి తీసుకువెడుతూ వుండేవారు. చిరంజీవిమాత్రం తాతనువదిలి రాననేవాడు. పద్మ బండిఎక్కి కొంతదూరం వెళ్లేదాకా తాతను చుట్టుకుపోయేవాడు. తాత అతణ్ణి అక్కున చేర్చుకొని అశ్రువులు రాల్చేవాడు.

సుందరమ్మ పేరవున్న మాగాణీతోనే కుటుంబ కాలక్షేపం. ఒకటి వుంటే ఒకటి లేకుండా నడుస్తోంది సంసారం. 'కల్పవృక్షాన్ని కాలపురుషుడు మొదలంటా పెకలించివేశాడు. తుంగముక్క పీడన, తల దాచుకోవలసి వచ్చింది' అని బాధపడేవాడు మాధవయ్య. మనస్సులో ఎంత బాధవున్నా మనుమణ్ణి తలుచుకొని మొలక నవ్వులు కల్పించుకొనేవాడు. ఒకప్పుడు జీవితాలు అలాగే సాగుతూ వుంటాయి—అగ్ని పర్వతం మీద మల్లెపొద పూసినట్లు! కాళరాత్రిలో మిణుగురులు షికారు చేసినట్లు, చిరుత పులి నిదురించే గుహపైన రాచిలుక ముక్కు నీరెండలో మెరసినట్లు—

చిరంజీవి పదునాలుగేండ్లవాడయ్యాడు. ఊళ్లోవున్న మిడిల్ స్కూలులో చదువుతున్నాడు; రోజూ బడికివెడుతూ దేవుడికి దణ్ణం పెట్టుకుంటూవుండేవాడు. ఆ సమయంలో తాత దగ్గిరవుండి సుబ్బారావుపేరిట వున్న లాయరుబల్ల చూపించి— 'నాన్న పేరున్న చోట నీ పేరు ఎప్పుడు వ్రాయిస్తావో! అప్పటిదాకా ఈ తాత ఉండక పోవచ్చు. అయినా నా అంతరాత్మ ఈ బల్ల అంచుల్లో పరిభ్రమిస్తూనే వుంటుంది బాబూ' అనేవాడు. 'తాతయ్యా! నువ్వు వుంటావు ... తప్పకుండా వుంటావు' అనేవాడు మనుమడు. తాత నవ్వి 'నేను చిరంజీవినా నాయనా?' అనేవాడు. 'అవును తాతయ్యా చిరంజీవివే! మన ఇద్దరి పేరూ ఒకటే... మనుమడు పేరు తాత పెట్టుకోవాలి' అని నవ్వుతూ బడికి వెళ్లేవాడు చిరంజీవి.

ఆరోజు ఆదివారం. చిరంజీవి యింట్లో కూర్చుని చాలాసేపు చదువుకొన్నాడు. కాసేపు ఆడుకొందామనిపించింది. బయటికి వెళ్లాడు. వెడుతూ వెడుతూ తలుపుమూల వున్న తాతయ్య చేతికర్ర తీసుకు వెళ్లాడు— కేవలం ఆట కోసం. కొంచెం సేపు ఆడాడు. ఎలా విరిగిందో ఆ కర్ర సగానికి విరిగింది. చిరంజీవి ఖిన్నుడయ్యాడు. తాత ఏమంటాడోనని భయం వేసింది. కాని చెప్పక తప్పదు. అబద్ధం అతడెప్పుడూ ఆడలేదు. తనను ఎంతో ప్రేమగా చూసుకొనే తాత వద్ద అబద్ధం ఆడటం తగనిపని అనుకొన్నాడు.

మాధవయ్య అప్పుడే నిద్రలేచి—మంచం క్రింద వున్న మరచెంబులో నీళ్ళు గ్లాసులో పోసుకొంటున్నాడు త్రాగడానికి. చిరంజీవి విరిగిన కర్రముక్కలు చూపించాడు. మాధవయ్య 'ఆ' అని కేక పెట్టాడు. గ్లాసు క్రిందపడి చప్పుడైంది. సుందరమ్మా, పద్మా, పరుగెత్తుకు వచ్చారు.

'నా చేతికర్ర విరగ్గొట్టాడు దుర్మార్గుడు...అసలు చేతికర్రను ఆ భగవంతుడు విరగగొట్టాడు. బ్రతుక్కి ఊతగా వుంటాండని ఆశపడిన చేతికర్ర అది. కూలిపోతున్న



శరీరానికి కొంచెం ఊతగా వున్న ఈ కర్రని వీచమడు విరగ్గొట్టాడు' అని అరిచాడు.

సుందరమ్మ ఏదో చెప్పబోయింది. మాధవయ్య మండి పడ్డాడు. పద్మ కొడుకు వంక కోపంగా చూసింది. చిరంజీవి తల ఎత్తలేదు. 'ఎందుకా వినయం? ఫో అవతలకి! అసలా కర్రతో నీకేం పని వచ్చింది? నే బ్రతకడం నీకిష్టం లేదా! ఈ కర్రను ఆధారం చేసుకుని ఈ కుంటి జీవితాన్ని ఎలాగో గెంటుతున్నాను. దాన్ని రెండుచేశావు' అని కళ్ళనీళ్ళు ఉత్తరీయంతో తుడుచుకొన్నాడు మాధవయ్య. మళ్ళీ మనుమడి వంక చూశాడు—'అభినయించాలు! అవతలికి నడు. తాతంటే నీకు లక్ష్యంలేదు. మనుమడి మీద మమకారం నదికి అవతల వొడ్డున చెట్టునవున్న పళ్ళు ఇవతల వొడ్డునుంచి కోసుకోవడానికి చేతులు జాచడంవంటిది! నదిమీద వంతెన పడిపోయింది. ఈభగ్న హృదయాన్ని బల్లకట్టు చేసుకొందామనుకొన్నాను. ఇది ఏం చేరుతుందా వొడ్డుకి! నాచేతికర్ర...పాతికేళ్లనుంచీవున్న చేతికర్ర... నడు...ఎధు...అవతలకు నడు' అని తాత అరిచాడు.

చిరంజీవి మెల్లగా లోపలికి వెళ్ళిపోయాడు— తల్లీ అతనివెంట వెళ్ళింది. సుందరమ్మ శూన్య దృక్కులలో అక్కడే నిలబడింది. విరిగిపోయిన కర్రముక్కలు—తెగిపోయిన ఆశా శకలాల్లాగా అక్కడ పడి వున్నాయి.

ఆ తర్వాత చాలా సేపటికి ఎప్పుడో త్రాగాలనుకొన్న మంచినీళ్ళు త్రాగి మంచం మీద నుంచి లేచాడు మాధవయ్య. చెప్పులు తొడుక్కొని మాగాణివైపు నడిచి వెళ్ళాడు. సాయంత్రం ఫలహారానికి రొట్టె ముక్క కాల్చి తెచ్చిన సుందరమ్మ సావిట్లో భర్త కనిపించక పోవడంవల్ల పళ్ళెం మీద మూత పెట్టి, వాకిట్లోకి వెళ్ళి చూచింది. కనపడలేదు. తలుపుచాటున పాదరక్షలున్నయేమో అని చూచింది. లేవు. 'బయటికివెళ్లారల్లే వుంది. ఫలహారమన్నా చెయ్యలేదు. ఎప్పుడూ రానికోపం వచ్చిందివ్వాళ. ఇల్లాలినిగా చలామణి అవుతున్నానన్నమాటేగాని, కోపం వస్తే శాంతింప చెయ్యడం చేతకాని మనిషిని' అనుకొంది. లోపలికివెళ్ళి చిరంజీవి ఏడీ? అని కోడల్ని అడిగింది, గేదెకోసం

# తాతయ్య చేతికర్ర

చిట్టుల్లో తెలగపిండి ముక్కలుకొట్టిస్తున్నాన్న పద్మ 'ఎలాగో వెళ్ళాడు. నాతో చెప్పలేదు' అంది.

మునిమాపు వేళయింది. పొలంనుంచి రైతులందరూ ఇళ్ళకు వస్తున్నారు. కర్ర లేకపోవడంవల్ల ఖాళీగావున్న కుడిచేతిని ఎడమ భుజంమీద వేసుకొని యింటికి వచ్చాడు మాధవయ్య. కాళ్ళు కడుక్కొని వాకిట్లో బల్లమీద కూర్చున్నాడు. సుందరమ్మ రొట్టెముక్కా, మంచినీళ్ళా తెచ్చి దగ్గిర పెట్టింది. 'చిరంజీవి ఏడీ?' అన్నాడు మాధవయ్య.

'ఎక్కడికో వెళ్ళాడు'

'ఎంతసేపైంది?'

'చాలాసేపైంది?'

'రొట్టెముక్క తిన్నాడా?'

'లేదు. చెయ్యకముందే వెళ్ళాడు'

'వాళ్ళ అమ్మతో చెప్పాడేమో అడుగు'

'అడిగా! తెలియదంది'

'మరి ఎక్కడికి వెళ్ళాడే! నే కోప్పడ్డానని మనస్సు బాధపెట్టుకొన్నాడేమో! తాతకు రాతగని రౌద్రం వచ్చిందివ్వాళ. తండ్రిలేని పిల్లాడు...వాణ్ణి ఏమీ అనకూడదని ఎన్నిసార్లో అనుకొంటాను...ఎన్నిసార్లో పెట్టుకొంటాను. కర్ర విరిగిందన్న కోపంతో 'దూరంగా ఫో' అన్నాను. వాడికి రోషం వచ్చిందేమో! ఛీ—ఎంత తప్పుచేశాను? ఎక్కడున్నాడో, వెళ్ళి బ్రతిమాలుకొంటాను' అని లేచి చెప్పులు తొడుక్కొన్నాడు మాధవయ్య.

'ఎక్కడో ఆడుకొంటూ వుంటాడు. రొట్టె కాస్త నోట్లో వేసుకోండి...మళ్ళీ ఎక్కడ తిరుగుతారు' అంది ధైర్యంచేసి సుందరమ్మ.

'రొట్టెముక్క వాడు కనపడందే నోటికెట్లా ఎక్కుతుందే! పాపిష్టి రోజు...ముసలివాళ్ళు జీవించకూడదు. మతితప్పి ప్రవర్తిస్తూ వుంటారు. బాధల్ని మనసులో దాచుకొనే శక్తిలేక కక్కేస్తూ వుంటారు. అవి ఎవరు సహిస్తారు? ఎవరు గ్రహిస్తారు?' అంటూ బైటికి వెళ్ళిపోయాడు.

మామూలుగా చిరంజీవివెళ్ళే చోట్లన్నిటికీ వెళ్ళాడు. అతని స్నేహితులందర్నీ అడిగాడు. జాడ తెలియలేదు. దుఃఖం ముంచుకు వస్తోంది. కళ్ళు వదేవదే తుడుచుకొంటున్నాడు. ఉత్తరీయం చివర ఉండలాగా చేసి నోట్లో పెట్టుకొన్నాడు. కనిపించిన వాళ్ళనల్లా మనుమని విషయం అడుగుతున్నాడు. వాళ్ళు కనిపించలేదంటే గావురుమంటున్నాడు. వాణ్ణి కోప్పడినందుకు కుమిలిపోతున్నాడు. మధ్య మధ్య కొడుకు జ్ఞాపకం వచ్చి మరింత రోదిస్తున్నాడు.

ఊరంతా తిరిగిన తర్వాత ఒకవేళ యింటికి వచ్చాడేమోనన్న ఆశతో ఒక కుర్రవాణ్ణి పంపాడు. తిరిగివచ్చి రాలేదని చెప్పాడు. వీధి మధ్యగా చతికిలపడిపోయాడు మాధవయ్య. ఒక ముసలిరైతువచ్చి లేవదీశాడు. 'కాలువవైపు ఆడుకోవడానికి వెళ్ళాడేమో! విచారపడకండి! వస్తాడు' అని ఓదార్చాడు. కాలవ అనగానే మాధవయ్య కాళ్ళీడ్చుకొంటూ అటువైపు నడిచాడు.

సందె చీకటి ఆవరించింది. ఇరువైపులా వున్న చెట్ల నీడలమధ్య కాలువ వడిగా ప్రవహిస్తోంది. మాధవయ్య 'బాబూ! బాబూ!' అని కేకలుపెట్టాడు. ఎవరూ పలకలేదు. వెళ్ళినేరేడుచెట్టు నీడను కూర్చున్నాడు. ఒక్కపెట్టున దుఃఖం పొంగివచ్చింది. నా చిరంజీవి చిరంజీవిగా వర్ధిల్లాలనుకున్నాడు. తలవంచుకొని దైవాన్ని ప్రార్థిస్తున్నాడు.

ఇంతలో నీళ్ళల్లో ఎవరో దూకిన చప్పుడైంది. మాధవయ్య పెద్ద కేకపెట్టి లేచాడు. పరుగు పరుగునవెళ్ళి నీళ్ళలో దూకాడు. 'బాబూ'అనే కేక వినిపిస్తోంది బయటకు. ఇంతలో కాలువగట్టు వెంట వస్తున్న చిరంజీకి ఆకేకలు వినిపించాయి. 'తాతయ్యా! తాతయ్యా' అని వొడ్డునుంచి అరుస్తున్నాడు. దగ్గిరగావున్న ఊరునుంచి వస్తున్న జలతారు గిన్నెలవర్తకుడు అక్కడికి వచ్చాడు. 'మా తాతయ్య! కాలవలో ఉరికాడు' అన్నాడు చిరంజీవి.

ఆ వర్తకుడు కావడి దింపి గభాలున కాలువలోకి ఉరికాడు. విసురుగావెళ్ళి తాతను పట్టుకొన్నాడు. తాత ఒక కుర్రవాణ్ణి పట్టుకొన్నాడు. వర్తకుడు ఇద్దర్ని వొడ్డుకు లాక్కువచ్చాడు. చిరంజీవి 'తాతయ్యా! ఇదేమిటి?' అని దుఃఖిస్తున్నాడు చిరంజీవి. తను రక్షించి తీసుకువచ్చిన కుర్రవాణ్ణి తాత ఆనవాలు పట్టలేదు. మనుమడే అను

కొన్నాడు. కళ్ళు తెరిచాక తాత 'నాకోసం బాబూ! నామీద కోపంతో కాలువలో దూకి నావా? నన్ను క్షమించు బాబూ' అంటు న్నాడు. చిరంజీవి 'నేను ఊరకలేదు తాతయ్యా ఈ అబ్బాయి ఎవరో' అన్నాడు. వ్యాపార స్థుడు కావడిలో వున్న అగ్గిపెట్టె తీసి వెలి గించాడు. ఆ వెలుతురులో చిరంజీవి ఆ కుర్రవాణ్ణి గుర్తుపట్టాడు. అతడు రామ నాథంగారి అబ్బాయి...కుమార్!...

కొంచెం సేపటికి కుమార్ కళ్ళు తెరి చాడు. తాతా మనుమడూ జలతారు వ్యాపా రస్థునికి కృతజ్ఞత తెలిపారు.

'తడిబట్టలతో ఏం వెడతావు? ఊళ్ళోకి రమ్మన్నాడు.' 'ఫర్వాలేదు. మా ఊరు దగ్గరే—మీరు యింటికి వెళ్ళండి బాబూ'—

అని అతడు బయలుదేరాడు. కుమార్‌ను తీసుకొని మాధవయ్యా, చిరంజీవి బయలు దేరారు. కుమార్ రానని కొంతసేపు గొడవ చేశాడు. ఇంతలో ఇద్దరు రైతులు వచ్చారు. కుమార్ సంగతి విని అతణ్ణి వెంటపెట్టుకొని ఊళ్ళోకి బయలుదేరారు.

మాధవయ్య అప్పుడు మనుమణ్ణి అడి గాడు— 'మధ్యాహ్నం నుంచీ ఎక్కడికి వెళ్ళావు బాబూ' అని చిరంజీవి అక్కడ వున్న చేతికర్ర తీసి 'నీకోసం ఇది తెద్దా మని పట్నం వెళ్ళాను. రావడం ఆలస్య మైంది' అన్నాడు.

'చేతికర్ర కోసం వెళ్ళావా! చెప్పకుండా వెళ్ళావేం?' అని మనుమణ్ణి కౌగిలించు కొన్నాడు తాత ఆ తడీ వంటితోనే.

* * *

ప్రొద్దుపోయిన తర్వాత మాధవయ్యను అభినందించడానికి వచ్చాడు రామనాథం. తన వంశం నిలబెట్టినందుకు ఎన్నివిధాలో ప్రశంసించాడు. కుమార్ సెప్టెంబరు పరీక్ష తప్పినందుకు తను కేకలు వేశానని — అందువల్ల అతడు వెళ్ళి చెప్పకుండా కాలు వలో పడ్డాడని రామనాథం చెప్పాడు.

చిరంజీవి రామనాథంగారిని గేటుదాకా పంపించి 'మా తాతయ్యగారి చేతికర్ర కోసం చెప్పకుండా బస్తీకి వెళ్ళాను. నాలుగు మైళ్ళేగదా నడుగెత్తుకు వద్దామనుకొన్నాను. ఆదివారం మాట మరచి పోయాను. బజారు మూసి వుంది. ఒకచోట ఎలాగో కర్ర సంపాదించాను. అందువల్ల రావడం ఆలస్య మైంది' అన్నాడు.

[illegible] చింది. మీ మేలు మరువలేను' అన్నాడు రామనాథం.

'రేపువుదయం మా తాతయ్యను కుర్చీలో కూర్చోపెట్టి చేతి కర్ర చేతికిచ్చి దణ్ణం పెడతాను. నీకున్నా కొనుక్కొమ్మని అప్పుడప్పుడూ తాతయ్య యిచ్చిన డబ్బులు దాచాను. అవి ఇందుకు ఉపయోగపడ్డాయి. అంతకంటే నా దగ్గర...' అని అతడు ఆపివేశాడు.

'చిరంజీవీ! చేతికర్ర బహూకరణ రేపు సాయంత్రందాకా ఆపు ... నేనూ, కుమార్ కూడా వస్తాం' అని చెప్పి రామనాథం వెళ్ళిపోయాడు.

అనుకొన్న ప్రకారం మర్నాడు సాయం త్రం తాతయ్యను కుర్చీలో కూర్చోబెట్టి చేతికర్ర [illegible] సేవ చేస్తాను' అని చిరంజీవి నమస్కరించాడు. రామనాథం చేతిలో వున్న కానుక పొట్లాం విప్పి శాలువ కానుక తీసి కుమార్‌చేత మాధవయ్య భుజాన కప్పించి 'మీ కిది చిన్న సన్మానం. మా వంశాన్ని నిలబెట్టిన మహనీయులు మీరు' అని పాదా లకు నమస్కరించాడు.

తాత సంతోషంతో పొంగిపోతున్నాడు. ఆ ఇద్దరు పిల్లల్ని దగ్గరకు తీసుకొని— 'కష్టాలు గడిచింది, భారతీయ బాలలు గర్వంతో జీవించండి! మీరు భావిభారత నాడు బాలికి [illegible]. భగవంతుడు మిమ్మల్ని కాపాడుతాడు' అని దీవించాడు. ఆయన కన్నీటి ముత్యాలు వారి తలలపై సేసలుగా కురిశాయి. ❁



బెర్క్‌షైర్‌లో మాజిస్ట్రేట్‌గా నియమితురాలైన మొట్టమొదటి భారతీయ మహిళ శ్రీమతి శీలాఫ్లాథర్. ఈమె లండన్‌లో బారిస్టర్‌గా అభ్యసించారు. ఈమె భర్త శ్రీ గ్రే ఫ్లాథర్ కూడా బారిస్టరే. వీరికి యిద్దరు పిల్లలు ఉన్నారు. [బి. ఇ. ]